సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 31 । మే । 2025



కదిలిన కృషీవలుడు

ఈసారి నైరుతి రుతుపవనాలు ముందే పలకరించడంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులు చేపడుతున్నారు. IIలో



'మసి'బారుతున్న బతుకులు

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ధూమపానంతో కలిగే అనర్థాలు, అనారోగ్యంపై ప్రత్యేక కథనం. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 25°

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్ల వారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్‌: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు,కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్‌.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్‌ నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు ముఖ్యఅతిథిగా తుమ్మల

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): జూన్‌ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదాన్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌, కోఆపరేషన్‌, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కానున్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మీ పార్టీ సంగతి చూసుకోండి

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై ఎంపీ బలరాం నాయక్‌




మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్‌

ఇల్లెందు: కాంగ్రెస్‌ మునిగిపోయే నావ వంటిదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించడం గర్హనీయమని మహబూబాబాద్‌ ఎంపీ పోరిక బలరాంనాయక్‌ పేర్కొన్నారు. తొలుత బీఆర్‌ఎస్‌లో ముసలం సంగతి చూసుకోవాలని ఆయన హితవు పలికారు. ఇల్లెందులోని టీపీసీసీ మాజీ సభ్యుడు ఎస్‌.కే.జానీ ఇంటికి శుక్రవారం వచ్చిన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏ పథకం అమలు చేయాలన్నా నిధుల కొరత వేధిస్తోందన్నారు. గత ప్రభుత్వం చేసి అప్పులు తీరుస్తూనే పథకాల అమలుకు శ్రమిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో గౌస్‌, గోచికొండ శ్రీదేవి, సాంబమహేష్‌, సయ్యద్‌ ఆజం, శ్రీనివాసగౌడ్‌, లింగంపల్లి శ్రీనివాస్‌, సిరాజ్‌ పాల్గొన్నారు.

బీఏఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్‌: 2025–26 విద్యా సంవత్సరంలో బెస్ట్‌ అవైలబుల్‌ స్కూల్‌(బీఏఎస్‌) పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధిశాఖాధికారి అనసూర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో రెసిడెన్షియల్‌(హాస్టల్‌)లో 69 సీట్లు, 1వ తరగతిలో నాన్‌ రెసిడెన్షియల్‌ (డే స్కాలర్స్‌)లో 66 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. రుద్రంపూర్‌ సెయింట్‌ జోసఫ్‌ హైస్కూల్‌లో 22 సీట్లు, స్వర్ణభారతి హై స్కూల్‌లో 22, భద్రాచలం లిటిల్‌ ఫ్లవర్‌ హై స్కూల్లో 22, లిటిల్‌ ఫ్లవర్‌ స్కూల్లో 69 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. జూన్‌ 16వ తేదీ లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని, 20న లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని వివరించారు.



ముందస్తు చర్యలేవి..?

ప్రభుత్వాస్పత్రుల్లో కిట్లు లేవు.. ల్యాబ్‌లు తెరుచుకోవు

- కోవిడ్‌ ఐసోలేషన్‌ వార్డు, బెడ్లు ఏర్పాటు చేయని వైద్యాధికారులు
- మరోవైపు జిల్లా ప్రజల్లో కరోనా భయం



కొత్తగూడెం ఆస్పత్రిలో మూతపడి ఉన్న కరోనా నిర్ధారణ పరీక్షల ల్యాబ్‌

కొత్తగూడెంఅర్బన్‌: దేశంలో పలుచోట్ల కరోనా కేసులు నమోదు కావడంతో ప్రజలు ఒకింత ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం కేసులు లేనప్పటికీ ముందస్తు చర్యలు చేపట్టడంలేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన ఏర్పాట్లు కూడా చేయడంలేదు. జలుబు, జ్వరం వంటి లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్న రోగులకు డాక్టర్లు సాధారణ పారాసిటమోల్‌, సిట్రిజిన్‌ వంటి మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలు చేసేందుకు కిట్లు కూడా లేవు. గతంలో కోవిడ్‌ పరీక్షలు నిర్వహించిన ల్యాబ్‌లు ప్రస్తుతం మూతపడి ఉన్నాయి. ల్యాబ్‌ల్లో సిబ్బంది, టెక్నీషియన్లు కూడా అందుబాటులో లేరు. కరోనా సమాచారం తెలుసుకోవాలని ప్రజలు ప్రయత్నిస్తే జిల్లాలో కేసులు ఏమి నమోదు కాలేదు కదా..? అప్పుడే తొందర ఏమి ఉందని వైద్యాధికారులు కొట్టిపారేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. సిబ్బంది, వైద్యులకు మినహా ఇతరులకు ఆస్పత్రుల్లో కనీసం మాస్కులు కూడా ఇచ్చే పరిస్థితి లేదు.

గతంలో 13,66,730 మందికి పరీక్షలు

జిల్లాలో గతంలో ఆర్‌టీపీసీఆర్‌, ర్యాపిడ్‌ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 13,66,730 మందికి నిర్వహించగా, 58,089 మందికి పాజిటివ్‌గా తేలింది. 572 మంది మృతి చెందినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు వెల్లడించారు. కొత్తగూడెం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్‌ ప్లాంట్‌ ద్వారానే అత్యవసర రోగులకు ప్రాణవాయువు అందిస్తున్నారు. పాల్వంచ ఆస్పత్రిలో కూడా నవభారత్‌ యాజమాన్యం సోషల్‌ రెస్పాన్స్‌బులిటీ కింద ఆక్సిజన్‌ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆ ప్లాంట్‌ ద్వారానే ఆస్పత్రిలోని అత్యవసర వార్డుల్లో ఆక్సిజన్‌ సరఫరా చేస్తున్నారు. కాగా ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో ముందస్తు చర్యలు చేపట్టలేదని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

అందుబాటులో లేని కిట్లు

కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రి, సింగరేణి ఆస్పత్రి, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం ఏరియా ఆస్పత్రుల్లో ఎక్కడా కరోనా పరీక్షలు చేసేందుకు కిట్లు లేవు. దీంతో ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లు కూడా మూతపడి ఉన్నాయి. కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో ఐసోలేషన్‌ వార్డు కూడా ఏర్పాటు చేయలేదు. ఇదే విషయమై ఆస్పత్రి ఆర్‌ఎంఓను సంప్రదిస్తే వార్డు ఏర్పాటు చేశామని, ప్రజలు భయపడతారని బోర్డు ఏర్పాటు చేయలేదని చెప్పారు. కానీ సాక్షి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో పరిశీలించగా ఐసోలేషన్‌ వార్డు, కనీసం బెడ్లు కూడా ఏర్పాటు చేయనట్టు తేలింది. ల్యాబ్‌, ఆక్సిజన్‌ సరఫరా వంటి విషయాలను ఆర్‌ఎంఓ దృష్టికి తీసుకెళ్లగా, ఆ విషయాలు చెప్పేందుకు తనకు సమయం లేదని పేర్కొనడం గమనార్హం. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో వైద్యాధికారులు పూర్తిగా విఫలమైనట్లు తెలుస్తోంది.

సిద్ధంగా ఉన్నాం



జిల్లాలో కరోనా కేసులు నమోదు కాలేదు. కేసులు ఏమైనా నమోదయితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రుల్లో ఐసోలేషన్‌ వార్డులు ఏర్పాటు చేయాలని సూపరింటిండెంట్లకు సూచించాం.

–భాస్కర్‌నాయక్‌, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

'కగార్‌' పేరుతో ప్రభుత్వ హత్యలు..

అరుణోదయ చైర్మన్‌ విమలక్క



మాట్లాడుతున్న అరుణోదయ చైర్మన్‌ విమలక్క

గుండాల: ఆపరేషన్‌ కగార్‌ పేరిట ఆదివాసీలను హత్య చేయడాన్ని నిలిపివేయడమే కాక అన్ని ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్‌ జడ్జితో విచారణ జరిపించాలని అరుణోదయ చైర్మన్‌ విమలక్క డిమాండ్‌ చేశారు. అంతేకాక కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. గుండాలలో అఖిల భారత రైతు కూలీ సంఘం, ఆల్‌ ఇండియా కేత్‌ మజ్దూర్‌ కిసాన్‌ సభ, రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన ఆపరేషన్‌ కగార్‌ను నిరసిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ మధ్య భారతంలోని అడవుల్లో ఉన్న విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేలా, ఆదివాసీలను అడవుల్లో నుంచి తరిమివేసేందుకే కగార్‌ పేరిట మానవ హననానికి పూనుకున్నారని ఆరోపించారు. మే 31నాటికి మావోయిస్టులను తుద ముట్టిస్తామని కేంద్రమంత్రి అమిత్‌ షా చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా కాల్పుల విరమణను మావోయిస్టులు ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం స్వాగతించకుండా వేలాది సైనిక బలగాలను అడవుల్లోకి పంపి మావోయిస్టు నాయకులతో పాటు అమాయక ఆదివాసీలను కాల్చి చంపుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే మావోయిస్టు కీలక నేత నంబాల కేశవరావు సహా 26 మందిని హత్య చేసి, మృతదేహాలు కూడా ఇవ్వకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. కేశవరావు మృతితో పాటు 2024 నుండి ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్‌ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ప్రసాద్‌, ఊక్లా నాయక్‌, నాగిరెడ్డి, వెల్తురు సదానందం, కోడెం వెంకటేశ్వర్లు, కందకట్ల సురేందర్‌, సోమన్న, బొమ్మర రాంబాబు, వి.చంద్రయ్య, మోకాళ్ల సమ్మయ్య, యుగంధర్‌, పల్స యాదగిరి, ఆరెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ సరఫరా చేశాం

- వేసవి కార్యాచరణ ప్రణాళిక విజయవంతం
- ఎన్‌పీడీసీఎల్‌ ఎస్‌ఈ మహేందర్‌



జి.మహేందర్‌

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): వేసవి కార్యాచరణ ప్రణాళిక విజయవంతంగా అమలు చేశామని ఎన్‌పీడీసీఎల్‌ సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌ జి.మహేందర్‌ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వివరాలు వెల్లడించారు. గతేడాది నవంబర్‌ నుంచి వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయడంతో నాణ్యమైన విద్యుత్‌ సరఫరా చేయగలిగామన్నారు. లోడ్‌ పెరిగే అవకాశం ఉన్న గుండాల మండలంలోని మామకన్ను, గుండాల, ఆళ్లపల్లి మండలంలోని ఆళ్లపల్లి, చర్ల మండలం సత్యనారాయణపురంలలో నూతన పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, దీంతో విద్యుత్‌ సరఫరాలో ఇబ్బందులు లేకుండా నివారించామని చెప్పారు. ఇప్పటివరకు 309 నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, 58 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచామని వివరించారు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, బూర్గంపాడు, సారపాక, మణుగూరు, అశ్వారావుపేట, దమ్మపేట, చుంచుపల్లి, సుజాతనగర్‌, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, టేకులపల్లి, బొమ్మనపల్లి, లక్ష్మీదేవిపల్లి, జూలూరుపాడులలో ఓవర్‌లోడ్‌ తగ్గించామని తెలిపారు.

అంతరాయాలను నివారించగలిగాం

గతంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో ఒకే వీసీబీపై రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఉండేవని, దీనివల్ల ఒక ఫీడర్‌లో అంతరాయం ఏర్పడితే మిగతా ఫీడర్లలో కూడా అంతరాయం కలిగేదని అన్నారు. ఈ సమస్యకు చెక్‌ పెట్టేందుకు బే ఎక్స్‌టెన్షన్‌/ప్రత్యేక వీసీబీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్‌ అంతరాయాలను తగ్గించామన్నారు. ఓల్టేజీలో హెచ్చుతగ్గులు లేకుండా క్షేత్రస్థాయిలో 45–600 కెపాసిటర్‌ బ్యాంకులు, 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో 8–1 ఎంవీఏఆర్‌ కెపాసిటర్‌ బ్యాంకులు కూడా ఏర్పాటు చేశామని వివరించారు. ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకుని వేసవికి సమాయత్తం కావడంతో అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్‌ సరఫరా చేశామని, ప్రతీ ఉద్యోగి నిబద్ధతతో పనిచేయడం వల్ల ఇది సాధ్యమైందని ఎస్‌ఈ తెలిపారు.

పోల్‌ ట్యాక్స్‌ చెల్లించాలి

భద్రాచలంఅర్బన్‌: పట్టణంలోని కేబుల్‌ టీవీ ఆపరేటర్లు, ఇంటర్నెట్‌ నిర్వాహకులు పోల్‌ ట్యాక్స్‌ సక్రమంగా చెల్లించాలని విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ మహేందర్‌ సూచించారు. భద్రాచలం విద్యుత్‌ శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్‌ స్తంభాలకు ఏర్పాటు చేసిన వైర్లు గజిబిజిగా ఉన్నాయని, సమస్య ఏర్పడినప్పుడు విద్యుత్‌ స్తంభాలు ఎక్కాలంటే కేబుల్‌ వైర్లతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. రానున్న వర్షాకాలంలో వేగంగా వీచే గాలుల వల్ల విద్యుత్‌ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని, ఆపరేటర్లు వైర్లను సరిచేసుకోవాలని చెప్పారు. డీఈ జీవన్‌ కుమార్‌, ఏడీఈ వేణు, ఏఈలు రాజారావు, ఉపేందర్‌ పాల్గొన్నారు.

ఆదివాసీలందరికీ ఒకే చట్టం అమలు చేయాలి

సెంట్రల్‌ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ భూక్యా భంగ్యానాయక్‌



మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ భూక్యా భంగ్యా నాయక్‌

పాల్వంచరూరల్‌: దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ గిరిజనులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని సెంట్రల్‌ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ భూక్యా భంగ్యానాయక్‌ అన్నారు. మండల పరిధిలోని కిన్నెరసాని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్‌ బునియాది కార్యకర్త సమ్మేళన్‌ రెండో రోజుకు చేరుకుంది. శుక్రవారం ఆదివాసీ చట్టాలు, జీవనవిధానం, సంప్రదాయాలపై ప్రొఫెసర్‌ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణ చట్టాలపై గిరిజనులు అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గిరిజన చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. ప్రతీ గిరిజనుడు హక్కులు, చట్టాలపై ప్రశ్నించగలగాలని చెప్పారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌, 1/70 చట్టం, పీసా చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌, కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య, ట్రైకార్‌ చైర్మన్‌ బెల్లయ్యనాయక్‌, ఏఐసీసీ ఇన్‌చార్జి రాహుల్‌ బాల్‌, గాదె ఇన్నయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కిన్నెరసానికి మంత్రుల రాక

తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్‌ బునియాది కార్యకర్త సమ్మేళన్‌ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌, టీపీసీసీ చీఫ్‌ మహేష్‌కుమార్‌గౌడ్‌ హాజరుకానున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వస్తారని, ఈ సందర్భంగా కిన్నెరసాని క్రీడా మైదానంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటతారని నిర్వాహకులు తెలిపారు.

ఏసీబీ డీఎస్పీకి క్యాష్‌ రివార్డు



రివార్డు అందుకుంటున్న డీఎస్పీ రమేష్‌

ఖమ్మంక్రైం: ఏసీబీ డీఎస్పీ రమేష్‌కు విధినిర్వహణలో అభినందనలు దక్కాయి. అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్‌ చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయన ఉమ్మడి జిల్లాలో అత్యధిక కేసులు నమోదు చేశారు. ఈనేపథ్యాన హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డీఎస్పీకి ఏసీబీ డీజీపీ విజయకుమార్‌ క్యాష్‌ రివార్డు అందజేశారు.

మూడు నెలలకు ఒకేసారి..

- రేషన్‌ బియ్యం అందించేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు
- ఇప్పటికే గోదాంలకు స్టాక్‌ చేర్చిన అధికారులు
- వర్షాకాలం దృష్ట్యా లబ్ధిదారులు ఇబ్బందిపడకుండా చర్యలు



రేషన్‌ తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్‌)

భద్రాచలంటౌన్‌: వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల రేషన్‌ పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. రేషన్‌ కార్డు లబ్ధిదారులకు జూన్‌, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్న బియ్యం జూన్‌లోనే అందించనుంది. ఇప్పటికే రేషన్‌ షాపుల గోదాంలకు బియ్యం చేర్చారు. జూన్‌ 1 నుంచి పంపిణీ చేయనున్నారు. ఏజెన్సీలో చిన్న చిన్న రేషన్‌ షాపుల్లో ఒకేసారి మూడు నెలల బియ్యం నిల్వ చేసే వీలు లేకపోవడంతో దశలవారీగా సరఫరా చేయనున్నారు. జూన్‌ చివరివరకు డీలర్లు మూడు నెలల కోటాను తీసుకెళ్లాలని పౌరసఫరాల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా, గత ఏప్రిల్‌ నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తుండగా, రేషన్‌ షాపుల్లో దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కొన్ని చోట్ల రేషన్‌ షాపుల్లో మూడు నెలల సన్నబియ్యం నిల్వకు స్థలం లేక డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. కాగా లబ్ధిదారులు ఈ–పాస్‌ మిషన్‌పై మూడుసార్లు వేలిముద్ర వేసి సన్నబియ్యం తీసుకోవాల్సిఉంటుంది. వర్షాల కారణంగా ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మూడు నెలల రేషన్‌ ముందుగానే అందించే ఏర్పాట్లు చేస్తోంది.

1.65 లక్షల క్వింటాళ్ల బియ్యం

జిల్లాలో మొత్తం442 రేషన్‌షాపులు, 2,93,683 రేషన్‌ కార్డులు ఉన్నాయి. వీటిపైనా ప్రతీ నెల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు 55 వేల క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేస్తున్నాయి. ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు. మూడు నెలలకు సంబంధించిన బియ్యం సుమారు 1.65లక్షల క్వింటాళ్లను జూన్‌లోనే ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంది.

పక్కదారి పట్టే అవకాశం!

వ్యవసాయ సీజన్‌లో గ్రామాల్లో ప్రజలు పనుల్లో బిజీగా ఉంటారు. మూడు నెల రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేయడంలో కొంత అవకతవకలు జరిగే అవకాశం ఉంది. ఏజెన్సీలో ఇప్పటికే ఈపాస్‌ యంత్రాలకు సర్వర్‌ మొరాయింపు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో డీలర్లు కార్డుదారుడితో మూడుసార్లు వేలి ముద్ర సార్లు వేయించి ఒక్కసారి రేషన్‌ ఇచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వం మూడు నెలల రేషన్‌ బియ్యం ఒకేసారి ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలోని రేషన్‌ షాపుల గోదాంలకు సన్నబియ్యం సరఫరా చేశాం. డీలర్లు జూన్‌ 1 నుంచి 30వ తేదీ వరకు అందిస్తారు. రేషన్‌ షాపుల్లో నిలవలను బట్టి బియ్యం సరఫరా చేస్తాం.

–రుక్మిణి, జిల్లా పౌరసరఫరాల అధికారి

త్వరలో పూసపల్లి ఓసీ పనులు

- గని ప్రాంతంలో సాగుతున్న చెత్తాచెదారం తొలగింపు పనులు
- వచ్చే నెలలో భూమి పూజకు సన్నాహాలు
- మూడు నెలల్లో బొగ్గు వెలికి తీసేలా కార్యాచరణ



జేకే ఓసీ మైన్‌ కార్యాలయం

ఇల్లెందు: కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అనుమతులు లభించడంతో జేకే ఓసీ(పూసపల్లి)పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే బొగ్గు వెలికి తీసే ప్రాంతంలో ఓబీ పనులు చేపట్టేందుకు చెత్తాచెదారం తొలగిస్తున్నారు. కొద్ది రోజుల్లో భూమి పూజ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రాబోవు మూడు నెలల్లో బొగ్గు వెలికి తీయాలని వారం రోజుల క్రితం ఇల్లెందు సందర్శించిన సీఎండీ ఎన్‌.బలరాం జీఎం వీసం కృష్ణయ్యను ఆదేశించారు. పదేళ్లపాటు జేకే ఓసీ(పూసపల్లి)లో 1.9 మిలియన్‌ టన్నుల బొగ్గు వెలికితీయనుండటంతో ఇల్లెందు సింగరేణి ఉద్యోగులు, అధికారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పరిహారం కోసం నిర్వాసితుల ఆందోళన

నూతన ఓసీకి అనుమతులు లభించడంతో ఓబీ వెలికితీతకు టెండర్‌ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఓబీ పనులను ఓ ప్రైవేట్‌ సంస్థకు అప్పగించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. మరోవైపు నిర్వాసితులు పరిహారం కోసం ఆందోళనలు చేపడుతున్నారు. 21 పిట్‌ ఏరియాలో వ్యవసాయభూములతోపాటు నివాస గృహాలు, పురాతన సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్నవారు రోడ్డెక్కుతున్నారు. ఏడాది కాలంగా ఓసీ పనులను అడ్డుకుంటున్నారు. వారం క్రితం కూడా జీఎం ఆఫీస్‌ను ముట్టడించారు. రెండు రోజుల క్రితం ఓబీ పనులను అడ్డుకున్నారు. పరిహారం సమస్య పరిష్కారమైతేకానీ ఓసీ పనులు ప్రారంభమయ్యే పరిస్థితిలేదు.

తరలిపోతున్న డంపర్లు

ఇల్లెందులోని జేకే–5 ఓసీ కాలపరిమితి గత మార్చితో ముగిసింది. దీంతో ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారు. డంపర్‌ తదితర యంత్రాలను తరలిస్తున్నారు. గత వారంలో నాలుగు డంపర్లను మణుగూరుకు తీసుకెళ్లారు. 12 మంది ఆపరేటర్లను సత్తుపల్లికి బదిలీ చేశారు. కాగా రూ.297.88 కోట్లతో 1114.507హెక్టార్ల భూమిలో బొగ్గు వెలికి తీయనున్నారు. ఇల్లెందు మండలంలో రొంపేడు, సుదిమళ్ల, ఖమ్మం జిల్లాలో సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలో జేకే ఓసీ విస్తరించనుంది.

త్వరితగతిన పనులు



నూతన జేకే ఓసీ(పూసపల్లి) ఏర్పాటుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి పత్రం విడుదలైంది. టెండర్‌ ప్రక్రియ పూర్తి చేసుకుని ఓబీ వెలికితీసే పనులకు సన్నాహాలు జరుగుతున్నాయి. త్వరితగతిన బొగ్గు వెలికితీసేలా చర్యలు తీసుకుంటాం.

–వీసం కృష్ణయ్య, ఇల్లెందు ఏరియా జీఎం

నేడు జీఎం ఆఫీస్‌, వర్క్‌షాపు ప్రారంభం

- ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- రూ.455.4 కోట్లతో వీకే–7 ఓసీ విస్తరణ పనులు



ప్రారంభానికి సిద్ధమైన జీఎం కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో నూతనంగా నిర్మించిన జీఎం కార్యాలయం, వర్క్‌షాపును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రారంభించనున్నారు. వెంకటేష్‌ ఖని (వీకే–7 షాఫ్ట్‌) భూగర్భ గనిలో నిక్షేపాలు పూర్తికావడంతో విస్తరణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో యాజమాన్యం రూ.455.4 కోట్లతో విస్తరణ పనులు నిర్వహిస్తోంది. సుమారు 184 మిలియన్‌ టన్నుల మిగులు నిక్షేపాలున్న వీకే–7 విస్తరణ గనికి దాదాపు 30 సంవత్సరాల జీవిత కాలం ఉండే అవకాశం ఉంది. దీంతో రూ.333 కోట్లతో కోల్‌ హ్యాండ్లింగ్‌ ప్లాంట్‌, రూ. 10 కోట్లతో ఏరియా వర్క్‌షాపు, జీఎం కార్యాలయం, రూ.80 కోట్లతో రైల్వే సైడింగ్‌ పనులు, రూ.20 కోట్లతో హైవే మళ్లింపు పనులు, రూ. 3.4 కోట్లతో ఫిల్టర్‌బెడ్‌ నిర్మాణ పనులు చేపట్టారు. వీటి పనులు ఏడాది క్రితమే పూర్తయినా ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. డిప్యూటీ సీఎం శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌ నుంచి పాల్వంచ చేరుకుని కిన్నెరసానిలోని తెలంగాణ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలలో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల వరకు అక్కడే స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారని, 1:50 గంటలకు 3 ఇంక్‌లైన్‌లో నూతన జీఎం కార్యాలయం, 4 ఇంక్‌లైన్‌లోని వర్క్‌షాపులను ప్రారంభిస్తారని, అనంతరం తిరిగి హైదరాబాద్‌ వెళ్తారని వివరించారు.

క్లుప్తంగా

గిరిజన మ్యూజియానికి రూ. కోటి

ప్రకటించిన కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియానికి కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ రూ. కోటి ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ అధికారులు శుక్రవారం హైదరాబాద్‌లో వివరాలు వెల్లడించారు. ఈ నిధులతో మ్యూజియాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంది. కాగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఇటీవల భద్రాచలం పర్యటనలో ఐటీడీఏ పీఓ రాహుల్ అభినందించి, రాష్ట్రంలో ఉన్న అన్ని ఐటీడీఏలలో ట్రైబల్ మ్యూజియాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

భూసేకరణపై గ్రామసభ



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా భూసేకరణ కోసం భూసేకరణ చట్టం ప్రకారం శుక్రవారం తిర్లాపురంలో పీసా గ్రామసభ నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ హాజరై.. భూములు కోల్పోయే వారికి సింగరేణి పరిహారం అందిస్తుందని, సింగరేణి అభివృద్ధికి సహకరించాలని సూచించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇప్పటికే తమలో చాలామంది ఓసీ విస్తరణలో భూములు కోల్పోయారని తెలిపారు. తమకు మెరుగైన నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇస్తేనే భూములు ఇస్తామని, లేదంటే ఇచ్చే ప్రస్తకే లేదని స్పష్టం చేశారు. పరిహారంపై స్పష్టమైన ఒప్పంద హామీ ఇవ్వకపోవడంతో గ్రామస్తులు గ్రామసభను బహిష్కరించి వెళ్లిపోయారు. సభలో తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు, పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్, ఎంపీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫాస్ట్ ఫుడ్‌తో అనారోగ్యం

జూలూరుపాడు: ఫాస్ట్ ఫుడ్ తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని యునాని డాక్టర్ రాజేందర్ అన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడులో యోగాపై అవగాహన నిర్వహించారు. రాజేందర్ మాట్లాడుతూ.. ఫాస్ట్ ఫుడ్ తినడం వల్ల చిన్న వయసులో ఊబకాయం, కంటి చూపు మందగించడం, గుండె జబ్బు, కిడ్నీ వ్యాధుల బారినపడతారని చెప్పారు. యోగాసనాలు, ధ్యానంతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వేల్పుల బోసు, బండ్ల వెంకటేశ్వర్లు, తిప్పర్తి శివ, పెండ్యాల నరేశ్, తాళ్లూరి నవీన్, నరేశ్‌చౌదరి, బసవయ్య, రజనీకాంత్, కోటయ్య పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఏజీఎం

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఏజీఎం పర్సనల్ (వెల్ఫేర్) గడిపెల్లి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ప్రకాశం స్టేడియంలో వర్క్‌పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ ఆధ్వర్యంలో నెలరోజులుగా సాగిన సమ్మర్ కోచింగ్ క్యాంపు శుక్రవారంతో ముగియగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏజీఎం మాట్లాడారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు, పరిసర ప్రాంత బాల, బాలికలు ఇక్కడ నేర్చుకున్న క్రీడల్లో నిరంతరం తర్ఫీదు పొందుతూ ఉండాలని చెప్పారు. అనంతరం సర్టిఫికెట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణమూర్తి, పీతాంబరరావు, కట్టా బసవయ్య, కోడూరు శ్రీనివాస్‌రావు, టి.శ్రీనివాస్‌రావు, పాసినెట్ పాల్గొన్నారు.

చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొత్తగూడెంఅర్బన్: పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ అధ్యక్షతన గర్భధారణ, ప్రసవానికి ముందు రోగ నిర్ధారణ పద్ధతులు, చట్టంపై జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. జయలక్ష్మి మాట్లాడుతూ..అల్ట్రాసౌండ్ స్కానింగ్ సమయంలో గర్భిణి సంసిద్ధత, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ నుంచి రిఫరల్, ఆధార్‌కార్డు కాపీని ఫారంతో జతచేయాలని పేర్కొన్నారు. వైద్యులు అనూష, ఎండీ అస్గర్‌హుస్సేన్, ఎం.సునీత, రాజమణి, స్పందన, ఫైజ్మోహియుద్దీన్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడు రిమాండ్

టేకులపల్లి: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.. టేకులపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మసిబారుతున్న బతుకులు..

పొగతాగడం వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని, అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చుట్ట, బీడీ, సిగరెట్ ఏదైనా ఆరోగ్యానికి హానికరమని తెలిసినా కూడా చాలామంది మారడం లేదు. ఆ అలవాటును వదిలేయడం లేదు. ఈ విషయాలను పరిశీలించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా మే 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. 1988 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది సదస్సులు, ర్యాలీలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నిస్తుంటారు.

- చుట్ట, బీడీ, సిగరెట్‌తో ఎన్నో అనర్థాలు
- గుండెపోటు, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం




భద్రాచలంలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రం (ఇన్‌సెట్) రాష్ట్ర ప్రభుత్వం రుపొందించిన అవగాహన పోస్టర్

భద్రాచలంఅర్బన్/కరకగూడెం: పొగాకు అన్ని రకాలుగా ప్రమాదకరమేనని, పొగాకు ఉత్పతులన్నీ నోరు, గొంతు, అన్న వాహిక, కడుపు, ఊపిరితిత్తులు, మూత్రవ్యవస్థపై ప్రభావాన్ని చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. పొగాకులో పాలిసైక్లిక్ ఆటోమేటిక్ హైడ్రోకార్బన్స్, నైట్రోజీన్ అమైన్స్‌తోపాటు కాడ్మియం, క్రోమియం, ఇథిలిన్ ఆక్సైడ్ వంటి దాదాపు 72 రకాల కేన్సర్ కారకాలు ఉంటాయంటున్నారు.

బలవుతున్న యువత..

జిల్లాలో 18 నుంచి 24 ఏళ్లలోపు వయసున్న యువత పొగాకు ఉత్పత్తుల వినియోగానికి బానిసలవుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం చెడు సావాసాలు. ఏటా కొత్తగా 8 శాతం మంది సిగరెట్‌కు అలవాటు పడుతున్నట్లు అంచనా. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ప్రతి నెలా రూ.కోట్ల ఆదాయం వస్తున్నట్లు సమాచారం. దీనిని బట్టి చూస్తే జిల్లాలో పొగాకు వినియోగం ఏ మేరకు ఉందో తెలుస్తోంది. పొగతాగే వారితోపాటు పీల్చే వారు సైతం అనారోగ్యానికి గురవుతున్నారు. పొగ తాగే భర్తల కారణంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్త్రీలలో పునరుత్పత్తి శక్తి తగ్గడం, అబార్షన్లు జరగడం, పిండంలో లోపాలు వంటి సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో సుమారు 3 లక్షల మందికి పైగా పొగతాగడం, లేదా పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు అంచనా. వీరంతా వివిధ రకాల గుండె, ఊపిరితిత్తుల జబ్బులకు గురవుతున్నారు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 714 మంది కేన్సర్ బాధితులున్నారు. అనధికారికంగా ఇంకా ఎక్కువగానే ఉన్నట్లు సమాచారం. ఎక్కువ మంది పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడమే అనారోగ్యానికి కారణంగా తెలిసింది. పొగతాగడం వల్ల గొంతు, ఊపిరితిత్తులు, కడుపు, మూత్రపిండాల కేన్సర్ సోకే అవకాశం ఉంది. గుండె రక్తనాళాలు బిరుసుగా మారి హార్ట్‌ఎటాక్ రావడం, నాడీ సంబంధ వ్యాధులు, పక్షవాతం, మధుమేహం, రక్తపోటు, మానసిక రుగ్మతలకు కారణమయ్యే అవకాశాలున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

భద్రాచలంలో డీఅడిక్షన్ సెంటర్

భద్రాచలం పట్టణంలో శాంతినగర్‌కాలనీలో దక్షత సొసైటీ ఆధ్వర్యంలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశారు. పొగాకుతోపాటు ఇతర వ్యసనాలకు బానిసలైన వారికి కౌన్సెలింగ్, బిహేవియర్ థెరపి చేస్తూ, మందులు అందజేస్తున్నారు. ఈ సెంటర్‌లో వైద్యుడు, కౌన్సిలర్లు, సూపర్‌వైజర్లు, ఫీల్డ్ వర్కర్లు 22 మంది పనిచేస్తున్నట్లు ఈ కేంద్రం అధ్యక్షుడు గుత్తా బాబు, ఉపాధ్యక్షురాలు సరోజనమ్మ తెలిపారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు ప్రచార కరపత్రాలు, స్టిక్కర్లను ఇటీవల ఆవిష్కరించారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..



పొగాకు ఏ రూపంలో ఉన్నా అది ప్రాణాంతకమే. సిగరెట్లు, బీడీలు, గుట్కా, నమిలే పొగాకు ఇవన్నీ తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తాయి. కేవలం వినియోగదారుల ఆరోగ్యానికే కాదు పరోక్ష ధూమపానం ద్వారా కుటుంబ సభ్యులు, పిల్లల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆరోగ్యకరమైన భవిష్యత్ కోసం పొగాకు వ్యసనం నుంచి బయటపడాలి.

– భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

మందులు పనిచేయవు..



ధూమపానం చేసేవారిలో మందులు పనిచేయని పరిస్థితి ఉంటుంది. మధుమేహం, రక్తపోటు ఉన్న వారు ధూమపానం చేస్తే మందులు వాడినా వ్యాధులు అదుపులో ఉండవు. ధూమపానం చేసేవారిలో మధుమేహం కారణంగా వచ్చే దుష్ఫలితాలు అధికంగా ఉంటాయి. కంటి రెటీనా సమస్యతో పాటు, సైలెంట్ హార్ట్ ఎటాక్, పక్షవాతం, కిడ్నీల సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ సీతారామరాజు, మధుమేహ నిపుణుడు

ప్రత్యేకంగా పర్యాటక అభివృద్ధి

- ఎకో టూరిజంలో కనకగిరి గుట్టలకు స్థానం
- భద్రాచలం, కిన్నెరసాని, పులిగుండాల అనుసంధానానికి ప్రణాళిక
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


వ్యూ పాయింట్ వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి తదితరులు

పెనుబల్లి: జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నందున ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తద్వారా పర్యాటక రంగానికే కాక స్థానికులకు ఆదాయం పెరగనుందని చెప్పారు. పెనుబల్లి మండలం పులిగుండాల ప్రాజెక్టు వద్ద అటవీశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టును కలెక్టర్ ముజ్మమిల్‌ఖాన్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో పాటు అటవీ, పోలీసు అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. బ్రహ్మళకుంట అటవీప్రాంత సమీపాన పులిగుండాల సాగునీటి ప్రాజెక్టు వద్ద రూ.20 లక్షలతో చేపట్టిన టూరిజం పనులను పరిశీలించాక, టూరిస్టుల కోసం ఏర్పాటు చేసిన బస్సును ప్రారంభించారు.

రాష్ట్రంలో మూడు ప్రాజెక్టులు

పులిగుండాల వద్ద సుమారు 30 వేల హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించిన అటవీ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎకోటూరిజం ప్రాజెక్టుగా గుర్తించి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోందని మంత్రి తుమ్మల వెల్లడించారు. రాష్ట్రంలోని వికారాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాలోని పులిగుండాల ప్రాజెక్టు వరకు కనకగిరి గుట్టల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. వీటన్నింట్లో పులిగుండాల ప్రాజెక్టును కీలకంగా గుర్తించి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. సుమారు రూ.7 కోట్ల నిధులతో ఎకో టూరిజం పనులకు శ్రీకారం చుట్టామని వివరించారు. కాగా, పెనుబల్లి మండలంలో ఇటీవల పోడు పేరుతో అడవులు నరుకుతున్నట్లు తెలిసిందని.. ఇలాంటి వారిపైనే కాక నిర్లక్ష్యంగా వహించే సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్టు పరిధిలో చిరుతపులి, ఎలుగుబంటి, తోడేలు వంటివే కాక 120 రకాల పక్షి జాతులు సంచరిస్తున్నందున పర్యాటకంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. పులిగుండాల ప్రాజెక్టు నుండి అటవీ మార్గం ద్వారా భద్రాచలం వరకు వెళ్లేలా రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు భద్రాచలం, కిన్నెరసాని, పులిగుండాల ప్రాజెక్టులను అనుసంధానం చేసేలా ప్రణాళికలు ఉన్నాయని వెల్లడించారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ అటవీ, పర్యాటక శాఖల మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు సహకారంతో పులిగుండాల ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మట్టా దయానంద్‌తదితరులు పాల్గొన్నారు.

పల్లె సమస్యలపై స్పందన


ఎన్‌కేనగర్‌లో తొలగించిన చెత్త

చుంచుపల్లి: కొంతకాలంగా ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలపై గురువారం సాక్షిలో ప్రచురితమైన 'పల్లెలో ప్రత్యేక పాట్లు'కథనానికి అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. పారిశుద్ధ్యంతో పాటు ఇతర సమస్యలపై దృష్టి సారించారు. ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో సమస్యలపై ఆరా తీస్తున్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనను సంప్రదించగా ప్రత్యేక అధికారులకు పాలనపై మరింత దృష్టి పెట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

పాల్వంచరూరల్: దంపతుల మధ్య గొడవ జరగగా మనస్తాపం చెందిన భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ధర్మసోత్ గోప భార్య సుజాత భర్తతో గొడవపడి గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ లభించకపోవడంతో సుజాత తండ్రి మాలోతు మగితియా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేశ్ కేసు నమోదు చేశారు.

యువతి ప్రాణాలు కాపాడిన వైద్యులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శిరీష

భద్రాచలంఅర్బన్: పురుగులమందు సేవించి, కోమాలోకి వెళ్లిన యువతికి 60 రోజుల పాటు చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన వైద్యులను పలువురు అభినందించారు. వివరాలిలా ఉన్నాయి.. చర్ల మండలం లెనిన్‌కాలనీకి చెందిన మడకం రమేశ్ కుమార్తె శిరీష గత ఏప్రిల్ 1న పురుగులమందు తాగింది. ఆమెకు స్థానికంగా ప్రాథమిక చికిత్స చేయించి, భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందిస్తుండగా కోమాలోకి వెళ్లింది. తర్వాత 60 రోజుల పాటు ఐసీయూలోనే ఉంచి, చికిత్స అందించి, కోమా నుంచి బయటపడేలా చేశామని వైద్యులు తెలిపారు. ఇదే చికిత్సకు ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.25 లక్షలు అవుతుందని వారు వివరించారు. కాగా, ఆస్పత్రి సూపరింటెంటెండ్ రామకృష్ణ, వైద్యులు జగదీశ్‌ను జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అభినందించారు.

ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

ఏరియా ఆస్పత్రిని శుక్రవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏసీయూలో చికిత్స పొందుతున్న శిరీషను పరామర్శించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, ఐసీయూ ఇన్‌చార్జ్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రిపోర్టులు ఇంకొకరికి..

సత్తుపల్లిలో స్కానింగ్ సెంటర్ నిర్వాకం

సత్తుపల్లి: స్కానింగ్ కోసం వచ్చిన గర్భిణికి ఇంకొకరి రిపోర్టు ఇవ్వడంతో ఆ నివేదిక ఆధారంగా తీసుకున్న మందులు వాడిన ఆమె అస్వస్థతకు గురైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటకు చెందిన నండూరి అనూష ఆరు నెలల గర్భిణి కాగా, ఈ నెల 19న సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చింది. అక్కడి వైద్యురాలు పట్టణంలోని ఓ రెస్టారెంట్ వీధిలో ఉన్న స్కానింగ్ సెంటర్‌కు పంపించింది. అయితే, నిర్వాహకులు ఆమెకు స్కానింగ్ చేశాక, తొమ్మిది నెలల గర్భిణి అయిన జ్యోతి రిపోర్టును ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా వైద్యురాలు రాసిన మందులు వాడుతుండడంతో అనూష అస్వస్థతకు గురైంది. ఇంతలోనే స్కానింగ్ సెంటర్ బాధ్యులు ఫోన్ చేసి జ్యోతి పేరిట రిపోర్టు ఇచ్చామంటూ ఫోన్ చేయగా.. శుక్రవారం స్కానింగ్ సెంటర్‌కు చేరుకున్న అనూష, ఆమె భర్త, బంధువులు ఆందోళనకు దిగారు. గర్భిణి ప్రాణాలతో చెలగాటం ఆడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.సీతారామ్‌కు ఫిర్యాదు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ జె.సురేశ్ కథనం ప్రకారం.. తడకలపూడి, చీమలపహాడ్ రైల్వేస్టేషన్ మధ్యన దాదాపు 35 నుంచి 40 ఏళ్ల వయసు గల వ్యక్తిని సింగరేణి రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు ఫుల్‌షర్టు, బ్రౌన్ కలర్ పాయింట్ ఉన్నాయి. రైల్వేట్రాక్‌పై చెత్త ఏరుకునే బస్తాలు, మృతుడు చూడడానికి యాచకుడి లాగా ఉన్నారని స్థానికులు తెలిపారు. తడికలపూడి రైల్వేస్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా ప్రధాన ఆస్పత్రి మార్చురిలో భద్రపరిచినట్లు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 99890 25481, 87126 58600, 970137 1472 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేసు నమోదు

ములకలపల్లి: సోదరుడిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని మూకమామిడికి చెందిన హుస్సేన్.. తన సోదరుడు రజాక్‌కు ఏడేళ్ల కిందట రూ.60 వేలు ఇచ్చాడు. రజాక్ ప్రస్తుతం మిర్యాలగూడలో ఉంటున్నాడు. ఈ నెల 28న తిరిగి మూకమామిడికి రాగా, హుస్సేన్, అతని భార్య నస్రీన్ తీసుకున్న నగదు ఇవ్వాలని అడిగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రజాక్.. హుస్సేన్, నస్రీన్‌లపై దాడి చేశాడు. నస్రీన్ శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


కిటికీ రాడ్‌లను కట్ చేసిన దుండగులు

పాల్వంచ: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. వనమాకాలనీలో మూగిది గణపతి ఐదు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి ఊరెళ్లాడు. ఇంటికి శుక్రవారం వచ్చి చూడగా.. ఇంటి కిటికీ ఐరన్ రాడ్‌లను కోసి, బీరువా తెరిచి, అందులోని 15 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు తేలింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.


పత్తి విత్తేందుకు అచ్చు తోలుతున్న రైతులు

కదిలిన 'కృషీవలుడు'

ఈసారి నైరుతి రుతుపవనాలు ముందే పలకరించాయి. దీంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులు చేపడుతున్నారు. గత రెండు రోజులుగా చేను చెలకలు సందడిగా మారాయి. వరి పొలాల్లో కొయ్య కాల్చడం, చేన్లకు పశువుల పెంట తోలడం, ట్రాక్టర్లతో దుక్కి దున్నడం, పత్తి విత్తేందుకు అచ్చు తోలడం వంటి పనులు చేస్తున్నారు.

–పాల్వంచరూరల్


చేనుకు చేవ కోసం పశువుల పెంట..


వరి పొలంలో కొయ్య కాల్చివేస్తూ..


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

ఇంకుడు గుంతలు నిర్మించాలి

జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

గుండాల: వర్షపు నీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంతలు నిర్మించాలని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి అన్నారు. గురువారం ఆమె పలు పంచాయతీ కేంద్రాల్లో నర్సరీలను, ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అన్ని గ్రామాల్లో ఇంకుడు గుంతలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీఓ శ్యాం సుందర్‌రెడ్డి, ఏపీఓ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి చేయాలి

దుమ్ముగూడెం : పంచాయతీల్లో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని డీపీఓ చంద్రమౌళి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని దుమ్ముగూడెం, లక్ష్మీనగరం పంచాయతీల్లోని పల్లె ప్రకృతి వనాలను, ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో 100 ఇంకుడు గుంతలను నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎంపీఓ బద్ది రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


గుండాల: ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ: పక్షవాతంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని హమాలీకాలనీకి చెందిన సమ్ము భిక్షపతి (57) పదేళ్ల కిందట పక్షవాతం బారినపడ్డాడు. ఆయన భార్య స్వరూప శుక్రవారం కూలి పనికి వెళ్లి వచ్చేసరికి భిక్షపతి బాత్‌రూంలోని ఇనుప పైపునకు ప్లాస్టిక్ వైర్‌తో ఉరివేసుకుని ఉన్నాడు. పక్షవాతంతో బాధపడుతూ మనస్తాపంతోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ..

టేకులపల్లి: మండలంలోని రేగులతండా గ్రామంలో ఇస్లావత్ రాము (40) ప్రభుత్వ పాఠశాల కిచెన్ రూంలో గురువారం అర్ధరాత్రి ఉరివేసుకొని మృతి చెందాడు. భార్య హరిత ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. రాము ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

కారుడ్రైవర్‌పై కేసు

పాల్వంచరూరల్: గొర్రెల కాపరిని ఢీకొట్టి గాయపరిచిన కారుడ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన ముంత బుచ్చయ్య గ్రామ శివారు ముత్యాలమ్మ గుడి వద్ద ఈ నెల 16న గొర్రెలను మేపుతుండగా పాల్వంచ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. బుచ్చయ్యకు గాయాలు కాగా.. ఆయన కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన రామవరానికి చెందిన బైరి కల్యాణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శుక్రవారం తెలిపారు.

ప్రెజర్ బాంబు పేలి గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలి వ్యవసాయ పనుల కోసం వెళ్తున్న ముగ్గురు ఆదివాసీలకు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మద్దేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగుప్పకు చెందిన గోటే జోగా, గోటే నాగయ్య, బద్దె సునీల్ సమీపంలోని బందెపారాలో ఉన్న వ్యవసాయ పొలాల వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబును గుర్తించకుండా తొక్కడంతో పేలింది. ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు చేరుకుని క్షతగాత్రులను మద్దేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కరెంట్‌షాక్‌తో ఎద్దు మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట గ్రామపంచాయతీ శాంతినగర్ గ్రామ శివారులో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై దుక్కిటెద్దు మృతి చెందింది. పంట చేలల్లో మేత కోసం వెళ్లిన ఎద్దు తక్కువ ఎత్తులో ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు బానోత్ రాంచంద్ వాపోయాడు. ఎద్దు మృతితో రైతుకు రూ.70 వేల వరకు నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.



కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సభలో గూగీ

● స్మరణ

ఆ అక్షరం అమ్మ గోరుముద్ద

స్త్రీ హృదయం, ఉద్యమం తెలిసిన మహా రచయిత గూగీ వా థియాంగో. గూగీని అక్షర ప్రపంచంలోకి తీసుకువచ్చింది... మహిళ. అతడి అక్షర బలానికి ఇంధనం... మహిళా చైతన్యం...

అమ్మ లేకపోతే 'గూగీ' ప్రపంచ సాహిత్యానికి పరిచయం కాకపోయేవారేమో! 'నాయనా... నాకు అక్షరం ముక్క రాదు. ఏంచేస్తావో, ఎలా చేస్తావో... నువ్వు మాత్రం బాగా చదువుకోవాలి' అని ఎప్పుడూ అంటూ ఉండేది. 'అమ్మ కోరుకున్నట్లే బాగా చదువుకున్నాను. మంచి స్థితిలో ఉన్నాను' అని సంతృప్తి పడి ఆకాశం వైపు మాత్రమే చూస్తూ కూర్చోలేదు గూగీ. వెనక్కి తిరిగి చూశారు.

'నాయనా... నువ్వు ఇంకా చదువుకోవాలి' అని అమ్మ అడిగినట్లు అనిపించింది. ఈసారి విశ్వవిద్యాలయం చదువులు కాదు తన కెన్యా జాతిజనుల జీవితాలను లోతుగా, మరింత లోతుగా చదివారు. కలానికి పదును పెట్టారు. మూలాలు మరవని గూగీ ప్రపంచ ప్రసిద్ధ రచయిత అయ్యారు.

అమ్మ నా హీరో

'నా హీరోలు ఇద్దరు. ఒకరు జోమో కెన్యట్ట. రెండో వ్యక్తి వాన్‌జీకూ' అనేవారు గూగీ. కెన్యన్ ప్రజల కోసం పోరాడిన యోధుడు జోమో కెన్యట్ట. రెండో వ్యక్తి గూగీ అమ్మ. వాన్‌జీకూ ప్రసిద్ధ ఉద్యమ నాయకురాలు కాకపోవచ్చు. అయితే ఉద్యమ చైతన్యం ఆమె వ్యక్తిత్వంలో మెరిసిపోయేది. ఆమె విద్యాధికురాలు కాకపోవచ్చు. అయితే ఆమె మాటల్లో, విశ్లేషణల్లో మేధస్సు కనిపించేది. ఆమెకు అక్షరం ముక్క కూడా తెలియదు. అయితే అక్షరం విలువ తెలుసు.

'మా అమ్మకు చదవడం, రాయడం రాదు. అయితే నేను బాగా చదువుకోవాలని కోరుకునేది.



బాగా చదువుకోవాలనే తన కలను నా ద్వారా నిజం చేసుకోవాలనుకునేది' అంటారు గూగీ. గూగీ నాన్నకు నలుగురు భార్యలు. 28 మంది పిల్లలు. వాన్‌జీకూ (గూగీ అమ్మ) మూడో భార్య. తనది రాజ్యహింస బాధిత కుటుంబం అనవచ్చు.

'కెన్యా ల్యాండ్ అండ్ ఫ్రీడమ్ ఆర్మీ'లో పనిచేస్తున్న ఒక సోదరుడు, స్టేట్ ఎమర్జెన్సీ సమయంలో మరో సోదరుడు హత్యకు గురయ్యారు. హోమ్ గార్డ్‌లు(కికుయూ హోంగార్డ్) చేతిలో తల్లి చిత్రహింసలకు గురైంది. గూగీ తొలి నవల 'వీప్, నాట్ చైల్డ్'లో అమ్మ కనిపిస్తుంది. ఇందులో కథానాయకుడి కల... ఎలాంటి పరిస్థితుల్లో అయిన బాగా చదువుకోవాలని. ఎందుకంటే అది తన తల్లి కల.

చిన్న వాళ్లు అయినా... పెద్ద మనసుతో...

'నేను ప్రసిద్ధ రచయితను' అనే అహం గూగీలో కనిపించేది కాదు. తన కంటే వయసులో చాలా చిన్న వాళ్ల నుంచి అయినా నేర్చుకునే, ఆలోచన తీరును మార్చుకునే, అభినందించే మంచి పద్ధతి గూగీలో ఉంది. దీనికి ఉదాహరణ నైజీరియన్ రచయిత్రి చిమమాండా అదిచే. 1977లో పుట్టింది. నాలుగు నవలలు, రెండు చిన్న కథా సంకలనాలు, వ్యాసాల పుస్తకాలు తీసుకువచ్చింది.

ఆమె నవలల్లో ఒకటైన 'హాఫ్ ఆఫ్ ఏ యెల్లో సన్' గూగీకి ఇష్టమైన నవల. నైజీరియన్ అంతర్యుద్ధానికి సంబంధించి తండ్రి చెప్పిన విషయాల ఆధారంగా ఈ నవల రాసింది. 'ఆమె నవలలోని పాత్రల గురించి ఆలోచించకుండా బియాఫ్రాన్ యుద్ధం గురించి ఎప్పుడూ ఆలోచించలేదు' అంటారు గూగీ. అమెరికన్ న్యూస్ టెలివిజన్ ప్రోగ్రాం....రేచల్ మాదో షో(టీఆర్ఎంఎస్). రేచల్ మాదో నిర్వహించే ఈ పోగ్రాం అంటే గూగీకి చాలా ఇష్టం. 'డ్రిఫ్ట్: ది అన్ మోర్నింగ్ ఆఫ్ అమెరికన్ మిలిటరీ పవర్' 'బ్లోఅవుట్: కరప్టెడ్ డెమోక్రసీ' 'బ్యాగ్‌మ్యాన్: ది వైల్డ్‌క్రైమ్స్' 'ప్రీక్వెల్: యాన్ అమెరికన్ ఫైట్ అగేనెస్ట్ ఫాసిజం' పుస్తకాలు రాసింది రేచల్.

'ఎంతటి జటిలమైన విషయాలను అయినా సులభంగా అర్థమయ్యేలా చెప్పడంలో రేచల్ దిట్ట. ఆమె అద్భుతమైన కథకురాలు. రేచల్ ప్రోగ్రామ్‌లో కనిపించాలనేది నా కల' అన్నారు గూగీ.

ఆమె సలహా ఎప్పుడూ గుర్తుపెట్టుకునేవారు

గ్రామీణుల మాటల్లో విలువైన జీవిత సత్యాలు, అనుసరించదగిన మాటలు ఉంటాయి. అందుకే వారి మాటలు వినడం అంటే గూగీకి ఇష్టం. కెన్యాలో మహిళా రైతు అయిన నెరి వాచాంగ ఇలా అన్నది... 'మరో అయిదు పనులు నీ మీద పడకముందే నీ ముందు ఉన్న అయిదు పనులు పూర్తి చెయ్యి. అలా కాకుండా ఒకేసారి పది పనులు చేయడం ఎంత భారం!' 'వాచాంగ ఇచ్చిన సలహాను పాటిస్తుంటాను. పాటిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. పాటించకపోతేనే ఇబ్బంది' అంటుండేవారు గూగీ.

ఉద్యమ మహిళల గొంతుక

అద్భుత చైతన్యం ఉన్న ఎన్నో తరాల మహిళలను ప్రత్యక్షంగా చూశారు గూగీ. అందుకే ఆయన రచనల్లో పోరాట పటిమ ఉన్న మహిళలు, సామాజిక, రాజకీయ మార్పు కోసం చేసే ఉద్యమాలలో క్రియాశీల పాత్ర పోషించే మహిళలు, పురుషాధిపత్యాన్ని కాలదన్ని తమదైన మార్గంలో నడిచి స్ఫూర్తినిచ్చే మహిళలు ఉంటారు. స్త్రీలపై సాగే దోపిడి, అణచివేతను అక్షరబద్ధం చేశారు గూగీ. కష్టాలు, కన్నీళ్లు మహిళలను ఉద్యమపథంలోకి వెళ్లకుండా అడ్డుపడలేవని తన నవలల ద్వారా చెప్పారు గూగీ.

బులియన్ 30న ముగింపు రూ.లలో (బంగారం 10 గ్రా.: వెండి కిలో)

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

హైదరాబాద్		**రాజమండ్రి**	
బంగారం (24 క్యారెట్లు)	96,110	బంగారం (24 క్యారెట్లు)	98,140
బంగారం (22 క్యారెట్లు)	89,430	బంగారం (22 క్యారెట్లు)	91,880
వెండి	99,000	వెండి	99,500
విజయవాడ		**ప్రొద్దుటూరు**	
బంగారం (24 క్యారెట్లు)	98,140	బంగారం (24 క్యారెట్లు)	95,600
బంగారం (22 క్యారెట్లు)	89,200	బంగారం (22 క్యారెట్లు)	87,950
వెండి	99,500	వెండి	98,700
విశాఖపట్నం		**చెన్నై**	
బంగారం (24 క్యారెట్లు)	97,310	బంగారం (24 క్యారెట్లు)	97,300
బంగారం (22 క్యారెట్లు)	89,200	బంగారం (22 క్యారెట్లు)	89,200
వెండి	1,10,900	వెండి	1,11,000

● కిచెన్ టిప్స్



మిగిలిపోయిన చపాతీ, బ్రెడ్‌స్లైసులు గట్టిగా అయిపోయి తినడానికి పనికిరావు. వీటిని ప్లేటులో పెట్టి, ఈ ప్లేటులోనే అరగ్లాసు నీటిని కూడా ఉంచి, మైక్రోవేవ్‌లో పదినిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల నీళ్లు ఆవిరిగా మారి చపాతి, బ్రెడ్‌స్లైసులు మెత్తబడి, అప్పుడే చేసినవాటిలా తాజాగా ఉండి, తినడానికి పనికొస్తాయి.



- వేపుడు కూరలు వండేటప్పుడు టీస్పూను వెనిగర్ వేస్తే కూర అంతగా నూనె పీల్చుకోదు.
- సన్నని మంట మీద యాపిల్ తొక్కలు మరిగించిన నీటితో అల్యూమినియం పాత్రలను తోమితే మొండి మరకలు ఇట్టే పోతాయి.

మిస్ వరల్డ్ 2025



నేడు ఫినాలే

బ్యూటీ కిరీటం ఎవరికి?



మిస్ వరల్డ్ పోటీకి విచ్చేసిన వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు

అందం అంటే ఆత్మవిశ్వాసం..
అందం అంటే ఓ సామాజిక బాధ్యత..
అందం అంటే సాధికారత..
అందం అంటే ఎమోషనల్ బ్యాలెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్..

అనే అందమైన నిర్వచనాలను స్థిరపరుస్తూ సాగుతున్న మిస్ వరల్డ్ పోటీలకు ఈసారి హైదరాబాద్ వేదికైంది! ఈ పోటీలు ఫైనల్‌కి వచ్చాయి.

మిస్ వరల్డ్ కిరీటం ఎవరికి దక్కనుందో తేలేది నేడే! నూటఎనిమిది దేశాలకు చెందిన సుందరీమణులు పోటీ పడుతున్న ఆ బ్యూటీ పాజెంట్ ఫైనల్ ఎలా ఉండబోతోంది, మిస్ వరల్డ్‌గా ఎంపికైన సుందరి ఏడాదంతా ఏం చేస్తుంది లాంటివి ఆసక్తిని రేకెత్తిస్తాయి.

హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో సాయంత్రం ఆరున్నరకు మొదలవనున్న మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే వేడుకను మిస్ వరల్డ్ 2016 స్టెఫనీ డెల్ బాయే (Stephanie del valle), యాంకర్, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ సచిన్ కుంభార్.. ఇద్దరూ కలిసి హోస్ట్ చేస్తున్నారు.

ఎంపిక ఇలా..

ముందుగా 108 దేశాల సుందరీమణులు వేదిక మీదికి వస్తారు. అమెరికా– కరిబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా– ఓషియానియాల నుంచి ఖండానికి పది మంది చొప్పున మొత్తం నలభై మందిని క్వార్టర్ ఫైనల్‌కి సెలెక్ట్ చేస్తారు. అయితే ఇప్పటికే రకరకాల పోటీల్లో ఈ నాలుగు ఖండాల నుంచి పద్దెనిమిది మంది క్వార్టర్ ఫైనల్‌కి చేరుకున్నారు. మిగిలినవారిని పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా సెలెక్ట్ చేసిన జ్యూరీ ఈ రోజు వాళ్ల పేర్లను ప్రకటించి వేదిక మీదికి ఆహ్వానిస్తుంది. ఈ నలభై మంది లోంచి ప్రతి ఖండానికి టాప్ ఫైవ్ చొప్పున, మళ్లీ అందులోంచి ప్రతి ఖండానికి టాప్ 2 లెక్కన సెలెక్ట్ చేస్తారు.



● ఐశ్వర్యా రాయ్



● రీటా ఫారియా



● ప్రియాంకా చోప్రా



● హెలెన్ మోర్గన్



● డయానా హెడెన్

ఫైనల్‌గా..

ఫైనల్‌రౌండ్ వచ్చేసరికి మొత్తం నలుగురు మాత్రమే మిగులుతారు. ఈ నలుగురిని జ్యూరీ ఓ ప్రశ్న అడుగుతుంది. ఆ జవాబును బట్టి మిస్ వరల్డ్‌ను ఎంపిక చేస్తారు. విజేతకు కిందటేడు మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా అందాల కిరీటాన్ని తొడుగుతుంది. జ్యూరీలో నటుడు సోనూ సూద్, సుధారెడ్డి, మిస్ ఇంగ్లండ్ 2014 డాక్టర్ కెరీనా టరెల్, మిస్ వరల్డ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లే సభ్యులుగా ఉంటారు.

గెలిచిన తర్వాత..

మిస్ వరల్డ్ టైటిల్ విజేత తన దేశం తరపున ప్రపంచవ్యాప్త సాంస్కృతిక కార్యక్రమాలు, అధికారిక వేడుకలు, సంబరాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. పలు చారిటీ ప్రోగ్రామ్స్, ప్రాజెక్ట్స్‌లో పాల్గొంటుంది. మిస్ వరల్డ్ సంస్థ తరపున ప్రపంచ యాత్ర చేస్తూ ఆ సంస్థ లక్ష్యాలను ప్రచారం చేస్తుంది. అక్షరాస్యత, పలు సామాజిక అంశాల అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

ఇంకా...

- మిస్ వరల్డ్ విజేతకు తొడిగే అందాల కిరీటం ధర రూ. 85 లక్షల పైచిలుకే! 18 క్యారట్ల గోల్డ్‌తో చేసిన ఆ కిరీటం మధ్యలో 62.83 క్యారట్ల డైమండ్ చుట్టూ 1770 చిన్న చిన్న డైమండ్స్ పొదిగి ఉంటాయి. వాటన్నిటి బరువు 175.49 క్యారట్లుంటాయి. దీన్ని ఆ విజేత ముఖ్యమైన ఈవెంట్స్‌లో మాత్రమే ధరిస్తుంది. ప్రపంచ యాత్రలో అసలైన కిరీటాన్ని పెట్టుకోదు. మిస్ వరల్డ్ విజయానికి చిహ్నంగా విజేతకు రెప్లికా క్రౌన్‌ను ఇస్తారు. అసలు కిరీటం మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ దగ్గరే ఉంటుంది. ఈ పోటీలకు వయోపరిమితి 17 ఏళ్ల నుంచి 27 ఏళ్లు.
- టర్మ్ అవకముందే మిస్ వరల్డ్ హోదాకు రాజీనామా చేసిన తొలి మిస్ వరల్డ్ 1974 సంవత్సర విజేత హెలెన్ మోర్గన్. టైటిల్ గెలిచిన నాలుగు రోజులకు ఆమె ఏడాదిన్నర బిడ్డకు తల్లి అని తెలిసిందట. మిస్ వరల్డ్ పోటీల్లో అవివాహితలు మాత్రమే పాల్గొనాలనే నియమాన్ని ఉల్లంఘించినందువల్ల ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది.
- అమెరికా – వియత్నాం యుద్ధంలో అప్పటి మన ప్రభుత్వం వియత్నాం పక్షాన నిలబడింది. దీనికి విరుద్ధంగా మన తొలి మిస్ వరల్డ్ రీటా ఫారియా అమెరికన్ ఎంటర్‌టైనర్ బాబ్ హోప్‌తో కలిసి అమెరికా సైనికులను ఎంటర్‌టైన్ చేసిందని ఆమె చర్య పట్ల అప్పుడు మన ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది.
- మిస్ వరల్డ్ పోటీలు మొదలైన నాటి (1951) నుంచి ఈరోజు దాకా మన దేశం ఆరుసార్లు కిరీటాన్ని గెలిచి రికార్డ్ సృష్టించింది.
- విజేతల్లో ఐశ్వర్యా రాయ్‌ను మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ మోస్ట్ సక్సెస్‌ఫుల్ మిస్ వరల్డ్‌గా చెబుతుంటారు.
- ఫెయిర్‌నెస్ క్రీమ్ ప్రకటనలకు నో చెప్పిన తొలి మిస్ వరల్డ్‌గా డయానా హెడెన్ (మిస్ వరల్డ్ 1997)ను ప్రస్తావిస్తారు. 'నా ఒంటి రంగు పట్ల నాకెలాంటి రిగ్రెట్స్ లేవు. ఛాయ తక్కువగా ఉండటాన్ని నేను ఆత్మన్యూనతగా ఎప్పుడూ భావించలేదు. ఆ స్కిన్‌టోన్‌తోనే నేను మిస్ వరల్డ్‌గా గెలిచాను. నా దృష్టిలో ఆత్మవిశ్వాసమే అసలైన అందం. కాబట్టి దాన్నే ప్రమోట్ చేస్తాను ఫెయిర్‌నెస్ క్రీమ్స్‌ని కాదు' అని చెప్పింది డయానా.
- అందాల పోటీల్లో చమత్కారం, సునిశిత దృష్టి గల జవాబులకు ప్రియాంక చోప్రా పెట్టింది పేరుగా ఖ్యాతినార్జించింది.

– సరస్వతి రమ


ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

వంటిల్లు

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పుట్టగొడుగులతో కేవలం కూరలే కాకుండా, రుచికరమైన చిరుతిళ్లు కూడా చేసుకోవచ్చు. నిజానికి మాంసాహారం తినని వారికి ఇవి చక్కటి ప్రత్యామ్నాయం అంటుంటారు చాలామంది. అలాంటి మష్రూమ్‌తో ఈ టేస్టీ స్నాక్స్ మీకోసం...

మష్రూమ్ మేనియా

మష్రూమ్ పిజ్జాలు



కావలసినవి: పెద్ద పోర్ట బెల్లా పుట్టగొడుగులు– 4 (లోపలి భాగం తొలగించి గుంతలా చేసుకోవాలి); టమాటో సాస్ – 3 టేబుల్ స్పూన్స్; మొజారెల్లా చీజ్ తురుము – అర కప్పు; ఆలివ్ ఆయిల్ – ఒక టేబుల్ స్పూన్; వెల్లుల్లి రెబ్బలు – 2 రెబ్బలు (సన్నగా తరిగినవి); ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, మొక్కజొన్న గింజలు, చిల్లీ ఫ్లేక్స్, పుదీనా తురుము, టమాటో ముక్కలు – కొద్దికొద్దిగా (అభిరుచిని బట్టి); ఉప్పు – సరిపడా; మిరియాల పొడి – చిటికెడు.

తయారీ: ముందుగా ఓవెన్‌ను 200 డిగ్రీల సెల్సియస్‌లో ప్రీహీట్ చేసి పెట్టుకోవాలి. పుట్టగొడుగులకు అన్నివైపులా కొద్దిగా ఆలివ్ ఆయిల్ రాసి, బేకింగ్ ట్రేలో ఉంచి, 5 లేదా 7 నిమిషాలు బేక్ చేసి, బయటికి తీసుకోవాలి. ఇప్పుడు ఆ పుట్టగొడుగుల లోపల పిజ్జా సాస్ రాసి, వాటిలో మొజారెల్లా చీజ్‌తో పాటు ఉల్లిపాయ ముక్కలు, టమాటో ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, స్వీట్ కార్న్ (వీటితో పాటు అదనంగా నచ్చినవి జోడించుకోవచ్చు) వంటివి వేసుకోవాలి. మళ్లీ ఓవెన్‌లో పెట్టి, చీజ్ కరిగే వరకూ బేక్ చేసుకుని, వేడి వేడిగా సర్వ్ చేసుకోవచ్చు.

మష్రూమ్ బజ్జీ



కావలసినవి: మష్రూమ్స్ – ఒక కప్పు (శుభ్రం చేసుకుని పెట్టుకోవాలి); శనగపిండి – ఒక కప్పు; బియ్యప్పిండి – 2 టేబుల్ స్పూన్లు; మసాలా, అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీ స్పూన్ చొప్పున; కారం, పసుపు, వాము పొడి, ఉప్పు – కొద్దికొద్దిగా; నీరు, నూనె – సరిపడా; వంట సోడా – కొద్దిగా.

తయారీ: ముందుగా శనగపిండి, బియ్యప్పిండి, అల్లం –వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, వాము పొడి, ఉప్పు, వంట సోడా వేసుకుని, తగినంత నీళ్లు పోసుకుంటూ బజ్జీల పిండిలా చిక్కగా కలుపుకోవాలి. అనంతరం ఒక్కో పుట్టగొడుగును శనగపిండి మిశ్రమంలో ముంచి నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి. వేడివేడిగా తింటే భలే రుచిగా ఉంటాయి ఇవి.

మష్రూమ్ కట్లెట్స్



కావలసినవి: పుట్టగొడుగులు – 200 గ్రాములు; బంగాళాదుంపలు – 4 చిన్నవి (ఉడికించి, తొక్క తీసి మెత్తగా గుజ్జులా చేసుకోవాలి); ఉల్లిపాయ – ఒకటి (చిన్నగా తరగాలి); నూనె – సరిపడా; పచ్చిమిర్చి – ఒకటి (సన్నగా తరగాలి); కొత్తిమీర పొడి – ఒక టేబుల్ స్పూన్; ఇంగువ, పసుపు – అర టీస్పూన్ చొప్పున; జీలకర్ర పొడి – ఒక టేబుల్ స్పూన్; గరం మసాలా పొడి – అర టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – అర కప్పు; శనగ పిండి – 3 టేబుల్ స్పూన్లు; పాలు – 2 టేబుల్ స్పూన్లు; గుడ్డు – ఒకటి; బ్రెడ్ పౌడర్ – కొద్దిగా; ఉప్పు – తగినంత.

తయారీ: ముందుగా పుట్టగొడుగులను శుభ్రం చేసి, తడిలేకుండా తుడిచి, చిన్న ముక్కలుగా కట్ చేసుకుని నూనెలో డీప్ ఫ్రై చేసుకుని పక్కనపెట్టుకోవాలి. అనంతరం పాన్‌లో నూనె వేడి చేసుకుని ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేయించుకోవాలి. తర్వాత ఇంగువ, పుట్టగొడుగు ముక్కలు, పసుపు, కొత్తిమీర తరుగు, గరం మసాలా, జీలకర్ర పొడి వేసి 2–3 నిమిషాలు ఉడికించి, చల్లారనివ్వాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో బంగాళదుంప గుజ్జు, శనగపిండి, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. ఇప్పుడు చిన్న చిన్న ఉండలుగా చేసుకుని నచ్చిన షేప్‌లో కట్లెట్స్‌లా ఒత్తుకోవాలి. ఇప్పుడు ఒక చిన్న పాత్రలో గుడ్డు, పాలు వేసి బాగా కలిపి, దానిలో ఈ కట్లెట్స్ ముంచి, బ్రెడ్ పౌడర్ పట్టించి, వాటిని నూనెలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది. వీటిని టమాటో సాస్‌లో ముంచి తింటే భలే రుచిగా ఉంటాయి.

– సన

● నయా వంచన

అయ్ బాబోయ్... ఏఐ వాయిస్ క్లోనింగ్!



ఆరోజు... ముంబైలో ఉండే కేశవ్‌కు ఫోన్‌కాల్ వచ్చింది. దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని సెకన్ల తరువాత... ఫోన్‌లో తన కుమారుడు శ్రీకర్ అరుపులు విని కేశవ్ షాక్ అయ్యాడు. 'దయచేసి నాకు బెయిల్ ఇప్పించండి' ఏడుస్తూనే అంటున్నాడు శ్రీకర్. 'మీరు 80,000 రూపాయలు చెల్లించాలి' అని ఫోన్ చేసిన వాళ్లు కేశవ్‌ను డిమాండ్ చేశారు. ఆ భయంలో, బాధలో ఏమీ తోచని కేశవ్ వారు చెప్పినట్లే చేశాడు. అయితే అది మోసం అని తెలుసుకోవడానికి కేశవ్‌కు ఎంతో టైమ్ పట్టలేదు. తన కుమారుడు సురక్షితంగానే ఉన్నాడు.

మరి వాయిస్ మాటేమిటి?

శ్రీకర్ వాయిస్‌ను అనుసరిస్తూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ వాయిస్ అది. సైబర్ మోసాలలో ఒకటి... ఏఐ వాయిస్ క్లోనింగ్. ప్రజల భావోద్వేగాలను, బలహీనతలను ఆసరాగా చేసుకొని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో మోసం చేస్తున్నారు స్కామర్స్. గత కొంతకాలంగా 'వాయిస్ క్లోనింగ్' ఊపందుకుంది. అయితే విద్యావంతులు, విద్యావంతులు కాని వారు అనే తేడా లేకుండా డెబ్బైశాతం మంది క్లోన్ వాయిస్‌లను గుర్తించలేపోతున్నారు. ఒక వ్యక్తి వాయిస్‌ను క్లోన్ చేయడానికి స్కామర్‌లకు జస్ట్ మూడు సెకన్ల సమయం చాలు.

మోసగాళ్ల బారిన పడకుండా కొన్నిచిట్కాలు

'అయ్యో... నన్ను గుర్తుపట్టలేదా!' అంటూ మోసగాళ్లు మాటలు కలుపుతారు.

'సారీ... గుర్తుపట్టలేదు' అంటే ఏమనుకుంటారో అని మొహమాటం కొద్దీ మాట్లాడడం మొదలుపెడతారు కొందరు. అలా చేస్తే మోసగాళ్లకు అవకాశం ఇచ్చినట్లే.

అందుకే... 'నేను ఫలానా...' అని అవతలి వ్యక్తి చెప్పినప్పుడు మీ ఇద్దరికి మాత్రమే తెలిసిన ఒక విషయం గురించి అడగండి. అతను కరెక్ట్ అని చెబితే ఓకే. కానిపక్షంలో అనుమానించాల్సిందే.

- స్నేహితుడు, బంధువు... మొదలైన వారి పేరుతో వచ్చిన కాల్ చాలా తక్కువ టైమ్ మాత్రమే ఉంటే అది వార్నింగ్ సైన్ అనుకోవచ్చు.
- ఏఐ స్కామ్ వాయిస్‌లు తెలియని నంబర్ నుంచి జరుగుతుంటాయి.
- ఆన్‌లైన్‌లో అపరిచితులకు వాయిస్ నోట్స్, వీడియో షేరింగ్ చేయకూడదు.